
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 • కనిష్ఠం 14.5

8
నిర్మల్
జిల్లా వార్తలు
ఆదివారం 19 జనవరి 2025

ఎదురుచూపులు





నిర్మల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి రేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపికను ఖరారు చేయబోతున్న నేపథ్యంలో ఆ రేషన్‌కార్డుల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్న చాలా మంది పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రాథమికంగా విడుదల చేసిన జాబితాలో చాలా మంది పేదల పేర్లు లేకపోవడంతో వారంత తీవ్రనిరాశకు గురవుతున్నారు. తాము గతంలో చాలాసార్లు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నామని అయితే ఇప్పటి వరకు తమకు రేషన్‌కార్డులు మంజూరు కాలేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేలో అధికారులు కుటుంబాలకు సంబంధించిన అన్ని రకాల వివరాలను సేకరించారు. ఈ వివరాల సేకరణ ఆధారంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 17,491 కుటుంబాలు తమకు రేషన్ కార్డులు లేనట్లు వెల్లడించారు. అయితే సర్వే అధికారులు వీరందరి వివరాలు నమోదు చేసుకున్నప్పటికి ప్రస్తుతం రేషన్ కార్డుల అర్హుల జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మొదట్లో సర్వే సందర్భంగా రేషన్ కార్డులు లేని 17,491 కుటుంబాల దరఖాస్తులను వేరిఫికేషన్ చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ సైతం ఆదేశించారు. అయితే ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు దీనికి సంబంధించిన నివేదికలను సైతం సిద్ధం చేశారు. అయితే ప్రస్తుత జాబితా ప్రకారం పరిశీలిస్తే అర్హుల ఎంపిక విషయంలో సారూప్యత కనిపించడం లేదంటున్నారు. ఇదిలా ఉండగా 18 ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలు, వార్డు సభల్లో మరోసారి అర్హులైన లబ్దిదారుల జాబితాను రూపొందించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ జాబితా ప్రకారం ఈ నెల 26వ తేదీన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియతో పాటు అర్హులైన వారి జాబితాను సైతం ఖరారు చేయనున్నారు. అయితే అధికారులు ప్రస్తుతం విడుదలైన జాబితా చివరిదీ కాదని ప్రస్తుతం వెరిఫికేషన్ మాత్రమే కొనసాగుతుందని చెబుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.



17,491 కుటుంబాల ఎదురుచూపులు

కాగా రేషన్‌కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 17,491 కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. గతంలో నిర్వహించిన సామాజిక ఆర్థికసర్వే ప్రకారం వీరంతా అర్హులేనని నిర్ధారించారు. సర్వే ముగిసి రోజులు గడుస్తున్నప్పటికి రేషన్ కార్డుల లబ్దిదారుల ఎంపిక జాబితాపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. అయితే ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అర్హులైన పేదలందరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఈ కుటుంబాలన్ని ఆ వైపు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా వీరందరి అభ్యర్థలను పరిగణలోకి తీసుకొని రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

గ్రామసభలే కీలకం..

కాగా రేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపిక వ్యవహారంలో గ్రామసభలు కీలకంగా మారబోతున్నాయి. మొన్నటి సర్వే ప్రకారం 17,491 కుటుంబాలు రేషన్ కార్డులు లేవని వెల్లడించినప్పటికి వీరి సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఇటీవల అధికారులు ప్రాథమికంగా విడుదల చేసిన జాబితాపై సర్వత్రా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో గ్రామసభల్లో జరిగే ఎంపిక ప్రక్రియ కీలకం కాబోతోందని అంటున్నారు. జాబితాలో తమ పేర్లు లేని వారంతా గ్రామసభల్లో గళమెత్తే అవకాశం ఉందని అంటున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నప్పటికి రేషన్ కార్డుల కోసం ఎంపిక చేయకపోవడం ఎంటని వారు ప్రశ్నించవచ్చని చెబుతున్నారు.

ఎంపిక కత్తి మీద సామే..

కాగా రేషన్‌కార్డుల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియతో పాటు రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక వ్యవహారం అధికారులకు కత్తీమీద సాములా మారే అవకాశం ఉందని అంటున్నారు. అధికారులకే కాకుండా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులకు లబ్దిదారుల ఎంపిక వ్యవహారం సమస్యలు సృష్టించే అవకాశం ఉందని అంటున్నారు. పథకాలకు ఎంపికైన లబ్దిదారులు సంబురాలు చేసుకునే అవకాశం ఉండగా ఎంపిక కానీ వారు మాత్రం ఆందోళనలు చేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. దీనిపై ప్రతిపక్షాలు సైతం పథకాలకు ఎంపిక కానీ వారిని వెంట పెట్టుకొని ఆందోళనలు జరిపే అవకాశాలు కూడా లేకపోలేదని అంటున్నారు. మొత్తానికి ఈ వ్యవహారం అటు అధికారులకు ఇటు అధికార పార్టీ నేతలకు కత్తీమీద సాములా మారే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కారు బోల్తా.. ఇద్దరి మృతి

● కోతులను తప్పించబోయి అదుపు తప్పిన వాహనం



బోల్తా పడ్డ కారును పరిశీలిస్తున్న ఏఎస్పీ, పోలీసులు

మామడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్‌హెచ్- 44 బూరుగుపల్లి రోడ్డుపై ఎంపీ 22 సీఏ 4588 అనే నెంబర్ గల కారు కోతులను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు మృతి చెందారు. సుమిత(53), విజయ్(57)లు మృతి చెందగా.. నితిన్, అనిత, సుధీర్ నిరంజన్ అనే ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రెండు కుటుంబాలు శ్రీశైలం వెళుతున్నాయి. మామడ మండలంలోని బూరుగుపల్లి జాతీయ రహదారిపై అడ్డుగా వచ్చిన కోతులను తప్పించబోయి కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అవడంతో క్షతగాత్రులను నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ రూరల్, సీఐ రామకృష్ణ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామడ ఎస్సై సందీప్ తెలిపారు.

ఎడ్లబండిని ఢీ కొన్న ద్విచక్రవాహనం

● బాలుడు, ఎద్దు మృతి



నిఖిల్ మృతదేహం

పెంబి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని షెట్‌పల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఎడ్లబండి, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక బాలుడు నిఖిల్ (9) చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. షెట్‌పల్లి గ్రామానికి చెందిన పవర్ రాజు తమ కుమారుడితో కలిసి మండల కేంద్రానికి వెళ్లి వస్తుండగా పెంబి గ్రామానికి చెందిన రైతు ఎడ్లబండి, బైకు ఢీ కొన్నాయి. ఎద్దు అక్కడికక్కడే మరణించింది. తీవ్రగాయాలైన బాలుడిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

సోన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్కీమ్‌లు లబ్ధిదారుల ఎంపికపై మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి గ్రామసభలు నిరవహించడం జరుగుతుందన్నారు.

నా మూట నా ఇష్టం..

ఎవరికి చెప్పుకుంటావో.. చెప్పుకో

● కండక్టర్‌తో మహిళ వాగ్వాదం




కండక్టర్‌తో వాగ్వాదానికి దిగుతున్న మహిళ

భైంసా రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నిర్మల్ నుంచి భైంసాకు వస్తున్న పల్లెవెలుగు (18 టి 8485) నెంబర్ గల ఆర్టీసీ బస్సులో శనివారం భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన ఎల్కబాయి భారీ లగేజ్‌తో బస్సు ఎక్కింది. ఇతర ప్రయాణీకులు బస్సు ఎక్కేందుకు దిగేందుకు ఇబ్బంది కరంగా మధ్యలో తన లగేజ్ పెట్టింది. నడవడానికి ఇబ్బంది ఉంటుందని కండక్టర్ ఆ మహిళను తన లగేజ్‌తో కిందకు దిగిపోవాలన్నాడు. సదరు మహిళ కండక్టర్‌ను కోపంతో నేను దిగను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. సీఎం రేవంత్‌రెడ్డికి అయినా చెప్పుకో అని అనవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వారి వాగ్వాదాలతో ఇతర ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

మస్కాపూర్

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

● మూడు కంప్యూటర్ల అపహరణ



మస్కాపూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో దొంగతనం జరిగిన కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న సీఐ

ఖానాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో దొంగతనం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపిన కథనం ప్రకారం.. ఈ నెల 11వ తేదీ నుంచి సంక్రాంతి సెలవులు రావడంతో పదవ తేదీన సాయంత్రం ఉపాధ్యాయులు పాఠశాలకు తాళం వేసి వెళ్లారు. కంప్యూటర్ గదికి సైతం తాళాలు వేసి అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా శుక్రవారంతో సంక్రాంతి సెలవులు ముగియడంతో శనివారం ఉదయం పాఠశాలను తెరిచారు. ఈ సందర్భంగా ఉదయం 8:25 గంటల సమయంలో పాఠశాలలోని కంప్యూటర్ గదికి వెళ్లి చూడగా కంప్యూటర్ గది తాళాలు పగలగొట్టినట్లు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చి కంప్యూటర్ గదిలోకి వెళ్లి పరిశీలించగా మూడు మానిటర్లు, మూడు సీపీ యూలు, మూడు యూపీఎస్‌లు, మూడు కీ బోర్డులు, మూడు మౌస్‌లు కపిపించలేదు. వీటి విలువ సుమారు రూ. 54 వేలని తెలిపారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భోనగిరి నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదారావు పేర్కొన్నారు.

ప్రైవేట్ రంగంలో నిరుద్యోగులకు డీట్ యాప్ వరం

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



లింబా (కే)లో అధికారులకు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగకల్పనలో డీట్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజ్ ఆఫ్ తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిరుద్యోగ యువకులకు ఉద్యోగకల్పనకై రాష్ట్రప్రభుత్వం రూపొందించిన డీట్‌యాప్‌లో కళాశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. అధికారులు ఈ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. డీట్ యాప్‌లో తమ విద్యార్హతలతో పేరును నమోదు చేసుకోవడం ద్వారా వివిధ ప్రైవేట్ కంపెనీలు, పరిశ్రమలు వారికి అవసరమయ్యే ఉద్యోగులను నియమించు కుంటుందని తెలిపారు. నిరక్షరాస్యులు కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఈ యాప్‌లో తమ పేరును నమోదు చేసుకోవచ్చునన్నారు. నిరుద్యోగులు ఇచ్చిన సమాచారం క్రోడీకరించుకొని యాప్‌లో ఆన్‌లైన్ రెజ్యూమ్‌ను పొందుపరుస్తుందని తెలిపారు. ఆ సమాచారం ఆధారంగా కంపెనీలు నిరు ద్యోగులను సంప్రదిస్తాయని తెలిపారు. ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్యానికి తగ్గ వేతనం లభిస్తుందన్నారు. పలు కంపెనీల్లో ఖాళీలను డీట్ యాప్‌లో పొందుపరుస్తాయని తెలిపారు. డీట్ యాప్ నిరుద్యోగులకు కంపెనీలకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. ఈ యాప్ ద్వారా నిరుద్యోగులు పారదర్శకంగా తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాన్ని పొందవచ్చు అన్నారు. నిరుద్యోగులకు అప్రెంటిస్, ఇంటర్న్‌షిప్‌ల సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు ఈ యాప్‌లో నమోదు చేసుకున్న జిల్లా నిరుద్యోగుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు జిల్లాకు చెందిన ప్రజలు అనధికారిక ఏజెంట్ల ద్వారా ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళ్లినట్లయితే వారి వివరాలను వారి కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని కార్మిక శాఖ కార్యాలయంలో వారి ఆధార్ కార్డుతో రేపటి నుంచి 26వ తేదీ లోపు సంప్రదించి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9866072044 నెంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సీపీవో జీవరత్నం, మెప్మా పీడీసుభాష్, జిల్లా కార్మిక అధికారి ముత్యంరెడ్డి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

20 లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

కుంటాల, జనవరి, 18 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 వ తేది నుంచి చేపట్టనున్న రైతు భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పర్యటనను ఈ నెల 20 తేదిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. శనివారం కుంటాల మండలంలో ఆమె ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రం కుంటాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పశు వైద్యశాలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అంతేగాకుండా ఆసుపత్రిలో ఔట్ పెషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. డ్రగ్స్ స్టోర్ రూమ్‌ను పరిశీలించి కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు బయట పడేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్నటువంటి మందులను రికార్డులలో పక్కాగా నమోదు చేయాలన్నారు. పశువైద్య శాలలో వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పౌర సేవా కేంద్రం, గ్రంథాలయం పరిశీలించారు. ఆ తర్వాత కుంటాల మండలంలో లింబా (కే) గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుపుతున్న బృందం పని తీరును పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని సూచించారు. లింబా (కే) గ్రామంలో ఆయా సర్వేనెంబర్లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాల వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులోని ఆయా సర్వే నెంబరులలో గల రైతులకు సంబంధించి పట్టా భూములను క్షేత్ర స్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లలో స్పష్టంగా నమోదు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందులో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా లబ్దిదారుల జాబితాను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో క్షేత్ర స్థాయి పరిశీలన జరుగుతుందని ముఖ్యంగా రైతు భరోసా పథకాల్లో అర్హులైన ప్రతి రైతుకు లబ్ది చేకూరేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూముల సర్వే నెంబర్లు వారిగా క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఆహారభద్రత కార్డులకు అర్హత కలిగిన కుటుంబాలకు అందించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార బృందాలు క్షేత్ర స్థాయి పరిశీలన జరుపుతున్నారని ఈ నెల 20 తేదీ నాటికి పరిశీలన పూర్తవుతుందని 21 నుంచి 24 వరకు ఎంపీడీఓను, తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారుల సమక్షంలో నిర్వహించనున్న గ్రామ సభలో వాటిని ప్రవేశపెట్టి చదివి వినిపించడం జరుగుతుందని గ్రామ సభ ఆమోదం మేరకు లబ్దిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 వ తేదీ నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పథకం అమలు చేపట్టి లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, జిల్లా వైద్య శాఖాధికారి రాజేందర్, పంచాయతీ అధికారి శ్రీనివాస్, వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, డీఎస్‌వో కిరణ్ కుమార్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్

నిర్మల్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలో స్వయం సహాయక సంఘాలు అభివృద్ధిలో ముందుండాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మహిళల ద్వారా నిత్యావసరాలు అయిన డిటర్జెంట్, ఫ్లోర్ క్లీనర్, టాయిలెట్ క్లీనర్ లాంటి వస్తువుల తయారీ కేంద్రాన్ని సంఘ మహిళలతో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. ప్రొడక్ట్ తయారు చేయు సంబంధిత యంత్రాన్ని బటన్ వేసి స్టార్ట్ చేశారు. అనంతరం వారిని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలకు మార్కెటింగ్ వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఇలాంటి శిక్షణలు ఇస్తున్న ఈడీఐఐ సంస్థకి కృతజ్ఞతలు తెలిపారు. తయారీదారులు మంచి నాణ్యతను



పాటించి మార్కెట్‌లో ముందుండాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ సుభాష్, ఈడీఐఐ సంస్థ ప్రతినిధులు అలేఖ్య, రవి, దేవేందర్‌లతో పాటు మెప్మా సిబ్బంది ఆర్పీలు, కౌన్సిలర్ నామెడ రమయ్య విజయ్, మాజీ కౌన్సిలర్ ధర్మాజీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి దారుణ హత్య

● మర్మాంగాలపై దాడి చేసి చంపిన దుండగులు
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



రిషి (ఫైల్), బాలుడి తల్లితో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్మల్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : 12ఏళ్ల బాలుడిని దుండగులు అతి దారుణంగా హత్య చేసిన ఘటన నిర్మల్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన రిషి (12) చదువు మధ్యలోనే మానేశాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. దీంతో రిషి గ్రామంలో ఉన్న కల్లు బట్టీలో పని చేస్తున్నాడు. రోజూలాగే శనివారం ఉదయం కూడా రిషి పని చేసేందుకు కల్లు బట్టీలోకి వెళ్లాడు. అయితే సాయంత్రం వేళ గ్రామ శివారులోని చింతల చెరువు సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రిషిని అతి దారుణంగా హత్య చేశారు. అతని మర్మాంగాలపై బండ రాళ్లతో కొట్టి మరీ చంపేశారు. సాయంత్రం వేళ చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లిన కొందరు గ్రామస్తులు రిషి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా.. కల్లుబట్టీ పని చేసే వ్యక్తుల మధ్య ఇటీవల జరిగిన గొడవే.. బాలుడి హత్యకు దారి తీసిందేమోనన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తాం

● నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ మండలంలోని చిట్యాల గ్రామంలో శనివారం బాలుడిని బండ రాయితో కొట్టి హత్య చేసిన స్థలాన్ని ఎస్పీ జానకి షర్మిల పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాలుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో దుండగులను పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నట్టు ఎస్పీ వివరించారు.

ఊర కుక్కల బీభత్సం.. పదిమందికి గాయాలు

ముథోల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో ఊరకుక్కల బీభత్సం ఎక్కువైపోయింది. అయితే ముథోల్‌లో శనివారం ఊర కుక్కలు పది మందికి గాయపరిచాయి. వీరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు తీసుకున్నారు. ముథోల్‌కు చెందిన సంజయ్, యూసుఫ్‌ఖాన్, సాయి, వినోద్, ఎస్‌డీ కలీం, ఎండీ కలీం, జ్యోతి, హరిత, రూపలకు ఊర కుక్కలు గాయపరిచాయి. కొన్ని పిచ్చి కుక్కలు గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్నాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఇంద్రవెల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఆత్రం మారుతి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హైమన్ డార్ఫ్‌బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వసంతోష్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులకు నిత్యవసర సరుకులతో పాటు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంక టేష్ గౌడ్, మడవి తెలంగరావు, మడవి భీంరావు పాల్గొన్నారు.

గ్రామస్థులకు అండగా ఉంటా

● బోథ్ నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి



ఎస్సీ కాలనీలో కల్వర్టును నిర్మిస్తున్న దృశ్యం

నేరడిగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నేరడి గొండ మండలంలోని తన సొంత గ్రామమైన తేజాపూర్‌కు అండగా ఉంటానని బోథ్ నియోజకవర్గ యూత్ అధ్య క్షుడు బద్దం పోతారెడ్డి అన్నారు. తేజాపూర్ గ్రామ పంచాయితీలోని ఎస్సీ కాలనీలో గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు నిర్మించి కల్వర్టు మర్చిపోయారు. ఆ కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఆ కాలనీవాసులు వారం రోజుల ముందు చెప్పడంతో శనివారం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి తన సొంత డబ్బులతో ఆ కల్వర్టును నిర్మించి ఆదర్శంగా నిలిచారు. ఆ కాలనీ వాసులు ఆయనను అభినందించారు.

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలి

ఇచ్చోడ, జనవరి, 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో కమిటీలు వేసి, మహాసభలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో రేణికుంట సురేష్ కళ్లెపల్లి గంగయ్య, లక్ష్మణ్, ఉస్మాన్, ఆశన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతిచెందిన అనిల్

జైనథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(కే) రామాయి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న సాత్నాలవాగులో శనివారం ఉదయం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఓ మత్స్య కారుడు మృతి చెందారు. గ్రామస్తులు మండల పోలీసులు తెలిపిన గ్రామంగా వివరాలు ఇలా ఉన్నాయి. రామాయి గ్రామానికి చెందిన టాప్రె అనిల్ (34) చేపల వేటకి వెళ్లి సాత్నాల నదిలో మునిగి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జైనథ్ మండల ఎస్సై వి.పురు షోత్తంకు ఫిర్యాదు చేయగా శవపంచనామా నిర్వహించి శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

● బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్



ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేరడిగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బోథ్ నియోజకవర్గ ఇన్ చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం నేరడి గొండ మండలంలోని క్యాంప్ కార్యాలయంలో బుగ్గరాం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆడేగజేందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తెలుపగా వెంటనే బోర్‌మోటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం తెలంగాణలోని అన్ని పల్లెలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రతి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి గ్రామాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో పేదప్రజలకు ఐదు లక్షల రూపాయలతో త్వరలోనే ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బోథ్ వ్యవ సాయ మార్కెట్ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావ్, నాయకులు రాజశేఖర్ రెడ్డి. రమేష్ కపిల్, ఎం.డి. సద్దాం, రాజేష్. ఉపాధ్యాయులు వెంకటరమణ. లీలావతి. సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ నాయకులకు సన్మానం



నాయకులను సన్మానిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్

ఉట్నూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ యూనియన్‌లో రాష్ట్ర సంఘంలో ఎన్నికైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి కో-సూపరిండెంట్ జాదవ్ ఉపేందర్ సన్మానించారు. శనివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం హర్షణీయమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ పేదగిరిజనులకు నాణ్యమైన చికిత్సను అందించి విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా నిజాయితీ చేపట్టాలని కోరారు. బొంకంటి సుభాష్, మహేష్ రెడ్డి, ఆత్రం భానుప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ డాక్టర్ ఉపేందర్ జాదవ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సంతోషం కలిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, సయ్యద్ సాజిద్ అలీ, హెడ్‌నర్స్ కుస్మ, అశ్విని, శ్రీలత, నివర్తి, తిరుపతి రెడ్డి, అమ ర్‌సింగ్, గంగాధర్, వీణ, మొయిన్, వెంకటేష్, ఆదర్శ్, అరుణ్ పాల్గొన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష



భైంసాలోని పరీక్ష కేంద్రం వద్ద నెలకొన్న సందడి

భైంసా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా కొనసాగింది. పట్టణంలో ప్రవేశ పరీక్ష కోసంగాను మూడు పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేశారు. పరీక్షకు 697 మంది హాజరు కావాల్సి ఉండగా 634 మంది హాజరవ్వగా 63 మంది గైర్హాజరయ్యారు. నర్సింహ నగర్ కాలనీ పరిధిలోని వాసవి హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులకు 223 మంది విద్యార్థులు , వేదం హైస్కూల్‌లో 240 మంది విద్యార్థులకు 225 మంది విద్యార్థులు, అల్ఫోర్స్ హైస్కూల్‌లో 217 మంది విద్యార్థులకు 186 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిర్వాహణ అధికారులు ప్రణాళిక బద్ధమైన చర్యలతో ఏర్పాట్లు చేపట్టడం మూలంగా నవోదయ ప్రవేశ పరీక్ష భైంసా డివిజన్ పరిదిలో ప్రశాంతంగా ముగిసింది.

ఫుడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎం. ఆంజనేయులు

లోకేశ్వరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన కీ.శే. గడ్డం లక్ష్మీ రెండోవర్ధంతి సందర్భంగా వారి కుమారులు అన్నదానం నిర్వహించారు. గడ్డం నరసింహ రెడ్డి (మాజీ బ్యాంక్ మేనేజర్) ఫుడ్‌బ్యాంక్ అధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేయమని కోరడంతో భైంసా చుట్టుపక్కల, వానల్‌పాడ్ ప్రాంతంలో వివిధ ఇటుక బట్టీలలో పని చేస్తున్న నిరుపేదలకు, మహారాష్ట్ర వలస కూలీలకు, ఆంధ్ర ప్రాంతానికి చెందిన శ్రీకాకుళంకు చెందిన వలస కూలీలకు దాదాపు 110 మందికి ఫుడ్ బ్యాంక్ భైంసా ఎం. ఆంజనేయులు వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... అన్నదానానికి సహాయం అందజేసిన దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరికి విజ్ఞప్తిచేశారు. మీమీ పుట్టిన రోజులను, పెళ్లి రోజులను వృధా ఖర్చు చేయకుండా నిరుపేదలకు అన్నదానం చేయడంతో వారి కడుపు నింపిన వారమవుతామని, అదేవిధంగా ఎంతో పుణ్యం వస్తుందని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



ఇచ్చోడ మండల అధ్యక్షుడు రమేష్‌ను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు

ఇచ్చోడ, జనవరి, 18, (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ అన్నారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు తహరె రమేష్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముస్తపురే అశోక్, నాయకులు బన్ని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పదోవార్డులో కల్వర్టు నిర్మాణం

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని సంవత్సరాలుగా పదోవార్డులో కల్వర్టు లేక కాలనీవాసులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కాలనీవాసులు, స్థానిక నాయకుడు సహకార సంఘం డైరెక్టర్ అయిన చట్ల ఉమేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కల్వర్టు పనులు చేపట్టేందుకు స్వతహా ముందుకు రావడంతో శనివారం కల్వర్టు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

పాఠశాలకు మైక్ సెట్ విరాళం

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుగుట్ట గ్రామంలో మైక్‌సెట్ కోసం వివేకానంద యూత్ సభ్యులు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయునికి రూ.ఐదు వేల విరాళం అందజేశారు. యూత్ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఇతర గ్రామాల యువకులకు ఆదర్శంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పొచ్చెర గ్రామాన్ని సందర్శించిన ఎంపీఈవో

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొచ్చెర గ్రామంలో జరుగుతున్న సర్వేను ఎంపీఈవో పరిశీలించారు. తప్పులు లేకుండా సర్వేను నిర్వహించాలని గ్రామ కార్యదర్శి గంగయ్యకు సూచించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

భీంపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత అధికారిణి కృష్ణవేణి అన్నారు. శనివారం భీంపూర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మిషన్‌శక్తి మహిళా సాధికారత ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా.. మహిళలకు సంబంధించిన సాధికారత, చట్టాలు, గృహహింస చట్టం, గర్భ లింగ నిర్ధారణ పరీక్ష యాక్ట్ చట్టం, ఫోక్సో యాక్ట్, హెల్ప్‌లైన్ నెంబర్, సైబర్ క్రైమ్స్, బాల్య వివాహ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్‌రాజ్, కోటేశ్వర్, సీసీ బాలాజీ పాల్గొన్నారు.



భీంపూర్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన

మహోన్నత వ్యక్తి ఎన్‌టీఆర్



భైంసాలో ఎన్‌టీఆర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన ప్రతినిధులు

భైంసా,జనవరి 18 (ఆంధ్రజ్యోతి) :తన జనరంజకమైన పారిపాలన తీరుతో,రాజకీయ చతురతతో , నటన కౌశల్యంతో తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి దివంగత నందమూరి తారక రామారావ్ అని టీడీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి రాజు, జనసేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకెట మహేష్‌బాబులు పేర్కొన్నారు. శనివారం భైంసా పట్టణంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని టీడీపీ ప్రభుత్వ హయంలో ఎన్‌టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,చేపట్టిన సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలు ప్రగతి బాటలో పయనించారని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు నిర్వహించారు. ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఇందులో టీడీపీ,జనసే భైంసా డివిజన్ ప్రతినిధులు మోహన్,విఠల్, బ్రహ్మయ్య,భూమేష్, షేక్ అఫ్జల్,రమకాంత్, సంజు, సతీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కట్ట హనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు

లోకేశ్వరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని భగీరథ చెరువుపై అతి పురాతన ఆలయాల్లో ఒకటైన కట్ట హనుమాన్ ఆలయంలో శనివారం హవర్గా మాజీ సర్పంచ్ భుజంగ రావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. అంతేకాకుండా లోకేశ్వరం గ్రామానికి చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ భక్తులు తినడానికి 20 స్టీల్ ప్లేట్లను అందించారు. ఈ సందర్భంగా కట్ట హనుమాన్ ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ రామారావు మాట్లాడుతూ... ప్రతి శనివారం కట్ట హనుమాన్ ఆలయంలో కట్ట హనుమాన్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు నిషేధం విధించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ చేసేవారు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

లక్ష్మణచాంద, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి ఆయా గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి వాటి కోసం ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తుననట్లు ఎంపీడీవో రాధారాథోడ్ తెలిపారు. వీటి నిర్వహణ కోసం ఆయా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. 20న బాబాపూర్, బోరిగాం, చామన్‌పెల్లి, చంద్రాపూర్, పొట్టపెల్లి(కె) 21వ తేదీన చింతల్‌చందా, ధర్మారం, కనకా పూర్, లక్ష్మణచాంద, తిరుపెల్లి, వడ్యాల్ తండాలో, 22న మల్లాపూర్, మునిపెల్లి, నర్సాపూర్(డబ్ల్యూ), న్యూ కంజర్, పార్‌పెల్లి గ్రామాల్లో, 23వ తేదీన పీచర, వడ్యాల్ గ్రామాల్లో ఉదయం 9:30 గంటలకు గ్రామ సభలు ప్రారంభమవుతాయని, ఈ సభలను స్థానిక ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

ఎయిడ్స్ వ్యాధి నివారణకు అవగాహన పెంచాలి

● రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జాయింట్ డైరెక్టర్ డా. రవి కుమార్



ఐసీటీసీ కౌన్సిలరుల, ల్యాబ్ టెక్నిషియన్లతో మాట్లాడుతున్న టీజీ ఎస్ఏసీఎస్ జాయింట్ డైరెక్టర్ డా. రవికుమార్

భైంసా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నివారణ చర్యలకు ప్రజల్లో అవగాహన పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జాయింట్ డైరెక్టర్ డా.రవికుమార్ సూచించారు. శనివారం భైంసా ఏరియా ఆసుపత్రిలో కొనసాగుతున్న ఐసీటీసీ కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ బి.నాగరాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర నిర్వాహణ వ్యవస్థకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు, కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నిషియన్ల పనితీరును పర్యవేక్షించారు. అనంతరం కేంద్ర కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నిషియన్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏరియా ఆసుపత్రికి వచ్చే ప్రతి గర్భిణీతో పాటు సుఖ వ్యాధులున్న వారందరికి పరీక్షలు నిర్వహించి హెచ్ఐవీ ఉన్న వారిని గుర్తించే చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రికి రాకుండా ఉన్న వ్యక్తులకు ప్రత్యేక శిబిరాలను నిర్వహణ ద్వారా హెచ్ఐవీ నిర్ధారిత పరీక్షలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఎయిడ్స్ వ్యాది సోకినట్లు గుర్తించిన వారి కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా పరీక్షలు నిర్వహింపచేసి జాగ్రత్త చర్యలను విశదీకరించాలని తెలిపారు. ఎయిడ్స్ వ్యాది బాధితులకు ఐసీటీసీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందించాలని సూచించారు. ప్రోగ్రామ్ జిల్లా మేనేజర్ బి.నాగరాజు మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులతో పాటు యువతీ, యువకులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించి చైతన్యపరచాలని పేర్కొన్నారు. ఇందులో ఐసీటీసీ కౌన్సిలర్లు మహిపాల్, విలాస్ , సతీష్, ల్యాబ్ టెక్నిషియన్లు సుధాకర్,తోఫిక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రవాణా, సాగునీటి సమస్యలు పరిష్కరించండి

● ముథోల్ ఎమ్మెల్యేకు లోకేశ్వరం మండల వాసులు విజ్ఞప్తి



భైంసాలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌తో సమావేశమైన లోకేశ్వరం మండల పలు గ్రామాలవాసులు

భైంసా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతాలకు నెలకొని ఉన్న రవాణ , సాగునీటి సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని లోకేశ్వరం మండల పరిధిలోని ఐదు గ్రామాల ప్రతినిధులు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, వాటోలి, ధర్మోరా, పంచగుడి గ్రామాల ప్రతినిదులు ఎమ్మెల్యేతో బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో ముథోల్ కేంద్రం నుంచి వాస్తపూర్ వరకు కొనసాగుతున్న డబుల్ లైన్ రోడ్డు పనులను పంచగుడి వరకు పొడగిస్తే తమ ఐదు గ్రామాలకు నెలకొని ఉన్న రవాణ సమస్య తీరుతుందని విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైప్‌లైన్ లీకేజీలతో సమస్యలు పెరుగుతున్నాని వివరించారు. ధర్మోరా చెరువుకు ఎత్తిపోతల పథకానికి అనుసందానం చేయాలని కోరారు. పెద్ద చెరువు తూముకు అవసరమైన మరమ్మత్తు చర్యలు నిర్వహింప చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు ఆయా గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను, అవసరమైన అభివృద్ధి పనుల గూర్చి ఎకరువు పెట్టారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఐదు గ్రామాల ప్రజల ముందే నీటిపారుదల శాఖాధికారులకు సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడి సాగునీటి వ్యవస్థకు సంబంధించి రైతులు తెలిపిన సమస్యలన్నింటిని వివరించి త్వరితగతిన వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత ప్రక్రియ నిర్వాహణలో కాలయాపనకు తావులేకుండా వ్యవహరించాలని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనుల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతతో కృషి చేస్తానని వెల్లడించారు. ప్రాధాన్యతననుసారం సమస్యల పరిష్కారానికి. అభివృద్ధి పనులు చేపట్టేందుకు చిత్తశుద్ధితో పాటుపడుతానని పేర్కొన్నారు. ఇందులో బీజేపీ లోకేశ్వరం మండల అధ్యక్షులు సాయన్న, మాజీ ఎంపీపీ మంద లింగన్నతో పాటు ఐదు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బాసరలో 1 నుంచి

వసంత పంచమి వేడుకలు

ముథోల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో వసంతపంచమి వేడుకలు ఈ నెల ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లో ఉత్సవ ఆహ్వాన పత్రికలు, గోడ ప్రతులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నవీన్‌కుమార్, సహాయ కార్యనిర్వాహణాధికారి సుదర్శన్, దేవస్థాన వైదిక బృందం, వేద పండితులు పాల్గొన్నారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో ప్రతి సంవత్సరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే వసంత పంచమి వేడుకలను వచ్చే నెల 1 నుండి 3 వరకు నిర్వహించ నున్నట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

కళాశాలను ఆకస్మికంగా

తనిఖీ చేసిన జిల్లా మాధ్యమిక విద్యాధికారి

కుభీర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 90రోజుల ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు పొందాలని సూచించారు. విద్యార్థుల నోట్స్, హాజరుశాతాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆధ్యాపకులకు సూచించారు. అనంతరం ఆధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సునీల్‌కుమార్, ఆధ్యాపకులు సంపత్, హన్మంత్ రావు, రమేష్, నర్సయ్య, శ్రీనివాస్, శివరాజ్, మహేష్‌లు పాల్గొన్నారు.

మరో ప్రాణాన్ని కాపాడిన బ్లూ కోర్ట్ సిబ్బంది



నిజామాబాద్ ప్రాంతంకు చెందిన విఠల్ సంతోష్‌తో బాసర పోలీసులు

ముథోల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాసర పోలీసులు గోదావరి నది వద్ద ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఎందరినో గుర్తించి వారి ప్రాణాలను కాపాడటంతో పోలీసుశాఖ ఉన్నతాధికారులతో పాటు ఇతరులతో కూడా ప్రశంసలు పొందుతూ భేష్ అనిపించుకుంటున్నారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు బాసర బ్రిడ్జిపై 24/7 పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. తాజాగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ విఠల్ సంతోష్ అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది తన ఆటోలోనే బాసర బ్రిడ్జికి చేరుకున్నాడు. స్నాన ఘట్టాల వద్ద ఆటోలోనే కూర్చుని సూసైడ్ నోట్ రాసుకుంటుండగా గమనించిన బ్లూకోర్ట్ పోలీస్ సిబ్బంది ప్రమోద్, గగన్ సూసైడ్ నోట్‌ను స్వాధీన పరుచుకొని బాసర ఎస్సై గణేష్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతనికి కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. అనంతరం బాధితుడు విఠల్ సంతోష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో బాసర ఎస్సై గణేష్‌తో పాటు బ్లూకోర్ట్ పోలీస్ సిబ్బంది ప్రమోద్, గగన్, తదితరులను జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేష్‌లు అభినందించారు.

భైంసాలో సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు

భైంసా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో విద్యుత్ సరఫరాలో నెలకొని ఉన్న అంతరాయల నివారణకు, వ్యవస్థ మెరుగుదలకు గాను శనివారం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో టౌన్ ఏఈ మోహన్‌కుమార్ నేతృత్వంలో విద్యుత్ సిబ్బంది సబ్ స్టేషన్‌కు మరమ్మత్తులు చేపట్టారు. ఇందులో బాగంగా కొత్త 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పూర్తి స్థాయి మరమ్మత్తులు చేపట్టారు. ఫీడర్లలలో చెడిపోయిన పలు పరికరాలను తొలగించి కొత్తవాటిని బిగించారు. లోడ్ నియంత్రికల్లో మార్పులు చేపట్టారు.ప్రమాదాల నివారణకు గాను 9 మీటర్ల పొడవుతోనున్న పలు విద్యుత్ స్తంబాలను తొలగించి వాటి స్థానాల్లో 11 మీటర్ల పొడవుతోనున్న కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సరఫరా వ్యవస్థ పూర్తిస్థాయి మెరుగుదలకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధమైన చర్యలతో ముందుకు సాగుతున్నట్లుగా ట్రాన్స్ భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

మామడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కాలగిరి గంగారెడ్డి సోదరుడి భార్య లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మంగు లింగన్న, మాజీ సర్పంచ్ భూమేశ్వర్, నాయకులు సుదర్శన్, మనోహర్ తదితరులు ఉన్నారు.

నిర్మల్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన తోడిశెట్టి పోశెట్టి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా శనివారం రోజు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ... ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



గోదావరి జలాలతో ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

గోదావరి పవిత్ర జలాలకు
మెస్రం గిరిజనుల పూజలు

ఉట్నూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలంలోని కలమడుగు వద్ద ఉన్న గోదావరిని రేవులోని హస్తిన మడుగు వద్ద పవిత్ర గోదావరి జలాలకు పూజలు చేసి నాగోబా జాతరకు తిరుగు పయనం అయినా మెస్రం వంశీయులు ఉట్నూర్ మండలంలోని గోండు కొత్తగూడెంకు శనివారం మధ్యాహ్నం చేరుకున్నారు. మాజీ ఎంపీపీ పంద్ర జయవంత్‌రావ్ ఆధ్వర్యంలో మెస్రం గిరిజనులకు స్వాగతం పాలికారు.ఈ సందర్భంగా మెస్రం వంశీయులు పవిత్ర జలాల కలశాన్ని చెట్టుపై నేలకు తాకని విధంగా పవిత్రంగా ఉంచారు. సమీప గిరిజన గ్రామాల ప్రజలు మెస్రం గిరిజనులు ప్రాంతానికి చేరుకొని పవిత్ర భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జైవంత్‌రావు వారికి పండ్లు, తేనీరు అందించారు. అక్కడి నుంచి మెస్రం వంశీయులు ఉట్నూర్ పట్టణంలోని ఏత్మసూర్ నగర్‌కు పాదయాత్ర ప్రారంభించారు. శనివారం రాత్రి పవిత్ర గోదావరి జలాలతో అక్కడ బస చేసి ఆదివారం ఉదయం నర్సాపూర్(బీ) వైపు వెళ్లడం జరుగుతుందని కోసుపటేల్ తెలిపారు. కార్యక్రమంలో దూట మహేందర్, కోలా సత్యన్న, కుర్సెంగా భూమన్న, అజ్మీరా జయచంద్ర, సూర్యకాంత్ యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.



పవిత్ర గంగాజలం కలశానికి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



దీపాయిగూడ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రజలు పాడి పంటలతో
సుభిక్షంగా ఉండాలి

● రాష్ట్ర మాజీమంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వేడుకున్నారు. గ్రామంలో గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వగ్రామం అయిన దీపాయిగూడ గ్రామానికి వచ్చిన మాజీ మంత్రి జోగు రామన్నకు డప్పులు బాజాల మధ్య స్వాగతం పలికారు. మహిళలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వ హించి కల్యాణోత్సవాన్ని నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇజ్జగిరి నారాయణ, లక్ష్మీపూర్, మాజీ సర్పంచ్ అడప తిరుపతి, సిర్సన్న, మాజీ సర్పంచ్ ఊశన్న, దీపాయిగూడ మాజీ సర్పంచ్ బొల్లి గంగన్న, ప్రధాన అర్చ కులు ధీరజ్ కుమార్, గ్రామస్థులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు మొక్కలు సిద్ధం



అటవీ శాఖ కార్యాలయంలో ప్లాంటేషన్ కోసం తీసుకువచ్చిన మొక్కలు

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి, నిగిరి రోడ్డుకు ఇరు వైపులా మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగానే వారం రోజుల క్రితం ఎవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కలు రావడం జరిగింది. దీంతో అధికారులు దాదాపు 4 వేల మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నారు. అంతేగాక అటవీ భూముల్లో సైతం మొక్కలను నాటాలని అధికారులు సమాయత్తమవుతున్నారు. ఏది ఏమైనా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటితే పచ్చదనం మరింత పెరిగే ఆస్కారం ఉందని ఆయా గ్రామాల వారు అంటున్నారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్షలు

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నవోదయ ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. 271 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 230 మంది మాత్రమే హాజరై పరీక్షలు రాశారు. పరీక్షల పరిశీలకునిగా కాగాజ్‌నగర్ జవహర్ నవోదయ పాఠశాల నుంచి రామావత్ శ్రీనివాస్ వ్యవహరించారు. పరీక్షలను పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్ష రాశారు. స్థానిక ఎస్సై ప్రవీణ్‌తో పాటు ట్రైనీ ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కర్ణాటక రాష్ట్రంలో వరుస బ్యాంకు దోపిడీలు..
అప్రమత్తమైన తెలంగాణ పోలీసు శాఖ

- బ్యాంకులలో సెక్యూరిటీ వ్యవస్థల పరిశీలన
- అలారం, సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షణ
- బ్యాంకు సెక్యూరిటీ గార్డులకు కీలక ఆదేశాలు
- బ్యాంకు మేనేజర్లతో భేటీ జరిపి పలు సూచనల జారీ

భైంసా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం కర్ణాటకలో చోటు చేసుకున్న వరుస బ్యాంక్ దోపిడి ఘటనల నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. బ్యాంకులు, ఫైనాన్స్‌లలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేపట్టి ఇక్కడి ప్రాంతంలో అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను ముందస్తు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే శనివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసు అధికారులు బ్యాంక్‌లు, ఫైనాన్స్‌ల వెళ్లి అక్కడి భద్రతా చర్యలను పరిశీలించారు. బ్యాంక్‌లలో అలారం వ్యవస్థతో పాటు సీసీ కెమెరాల స్థితి,గతులు, సెక్యూరిటి గార్డుల పనితీరులను పర్యవేక్షించారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో మూడు రోజుల క్రితం ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు వెలుతున్న సెక్యూరిటీ వాహనంపై దొంగలు కాల్పులు జరిపి అందులో నుంచి రూ.93 లక్షలు దోచుకెళ్లారు. ఇదే దొంగల మూఠ హైదరాబాద్‌లోనూ అలజడి రేపింది. ఈ సంఘటన మరిచిపోకముందే శుక్రవారం అదే రాష్ట్రంలోని మంగుళూర్ ప్రాంతంలోని కోటికారు వ్యవసాయ సేవా సహకార సంఘం బ్యాంక్‌లో పట్టపగలే దోపిడి మూఠ చొరబడి మరణాయుధాలతో బ్యాంక్ అధికారులు, ఖాతాదారులకు భయపెట్టి భారీ చోరికి పాల్పడింది. బ్యాంక్‌లకు సంబంధించి వరుస ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇక్కడి ప్రాంతంలో అలాంటి ఘటనలకు తావులేకుండా ఉండేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని పలు బ్యాంక్, ఫైనాన్స్‌లలో శనివారం టౌన్ పోలీసు సీఐ గోపినాథ్ సెక్యూరిటి వ్యవస్థల పరిశీలనలు చేపట్టారు. ఆయా బ్యాంక్‌లలోని అలారం, సీసీ కెమెరాల వ్యవస్థలను పర్యవేక్షించారు. ఆయా బ్యాంక్‌లలోని సెక్యూరిటి గార్డుల పనితీరును పర్యవేక్షించారు.అనంతరం ఆయా బ్యాంక్‌ల మేనేజర్లతో సమావేశమై ముందస్తు జాగ్రత్త చర్యలపై పలు సూచనలు అందచేశారు. బ్యాంక్ పనివేళల్లో అంతటా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు పెట్టే సమయంలో సెక్యూరిటి గార్డుల రక్షణ ఖచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షించుకోవాలన్నారు. తదనంతరం బ్యాంక్‌ల్లోని సెక్యూరిటి గార్డులతో మాట్లాడి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్యాంక్‌లలో అనుమానస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే వారి వద్దకు వెళ్లి తనిఖీలు చేపట్టాలన్నారు. వారి వద్ద ఆయుదాలు, చోరికి పాల్పడే వస్తువులను గుర్తిస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించి బ్యాంక్ లోనికి వచ్చే వారిని నిలువరించాలన్నారు. మాస్కులు ధరించి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్యాంక్ పని వేళల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. భద్రతకు వినియోగిస్తున్న ఆయుదాలను సురక్షితంగా ఉంచుకోవాని తెలిపారు. ఇదే క్రమంలో బ్యాంక్‌ల వద్ద పోలీసు సిబ్బంది పర్యవేక్షణ సైతం చేపట్టింది.



భైంసాలోని ఎస్‌బీఐ బ్యాంక్



భైంసాలో బ్యాంకు అధికారులకు సూచనలిస్తున్న టౌన్ పోలీసులు



బ్యాంక్ సెక్యూరిటి గార్డులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ గోపినాథ్

కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణాలు

● సంక్రాంతి సెలవుల అనంతరం తిరుగు ప్రయాణికులతో రద్దీ

భైంసా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదిన సెలవులు ముగిసిన నేపథ్యంలో స్వస్థలాల నుంచి నివాస స్థలాలకు తరలుతున్న తిరుగు ప్రయాణికులతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. శనివారం జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ ప్రయాణ ప్రాంగణాల్లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ రూట్లలలోని బస్సులన్నీ ప్రయాణీకులతో కిటకిటలాడిపోయాయి. వివిధ ప్రాంతాలలో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్లిన వారందరూ సంక్రాంతి పర్వదిన వేడుకలను స్వగ్రామాల్లో నిర్వహించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రస్తుతం పర్వదిన వేడుకలతో పాటు సెలవులు ముగిసిన నేపథ్యంలో వారందరూ తాము చదువుకుంటున్న, ఉద్యోగ,ఉపాధి నిర్వహిస్తున్న కేంద్రాలకు బయలుదేరుతున్నారు. నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగస్తుల కుటుంబాలు వెలుతున్న నేపథ్యంలో ఆయా రూట్లలోని ఆర్‌టీసీ, ప్రైవేట్ బస్సులు, వాహనాల్లో రద్దీ నెలకొంది.

● హైదరాబాద్‌కు అదనపు బస్సు సర్వీసులు

తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో భైంసా నుంచి హైదరాబాద్‌కు అదనపు బస్సులు నడుపుతున్నట్లుగా భైంసా బసు డిపో మేనేజర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా బస్టాండ్ నుంచి ఆదివారం ఉదయం 7 గంటలకు, 11.30 గంటలకు, మధ్యాహ్నం 3.30 గంటలకు, సోమవారం ఉదయం 4.30 గంటలకు, 11.30 గంటలకు హైదరాబాద్‌కు అధనపు బస్సులు నడుపుతున్నట్లుగా వివరించారు. ప్రయాణికులు అదనపు బసు సర్వీసులను సద్వినియోగపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



భైంసా ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికుల రద్దీ

అడెల్లి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడు..!?



అడెల్లి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ జి.నగేష్ (ఫైల్)



ఇటీవల మొరం వేయించిన దృశ్యం

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని కుచలాపూర్ ధన్నూర్ మీదుగా ని ర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయమైన అడెల్లి వరకు రోడ్డు నిర్మాణపు పనులు రూ.9కోట్ల 80 లక్షలతో మూడేళ్ల క్రితం ప్రారంభించారు. అయితే రఘునాథ్ పూర్ నుంచి కుచలాపూర్ వరకు పనులు వేగవంతంగా జరిగిన ఘాట్ కటింగ్ పనులు కొంత ఆలస్యంగా జరిగాయి. దీంతో 18 నెలల వరకు కుదుర్చుకున్న అగ్రి మెంట్ కాలం పూర్తయినా పనులు మాత్రం పూర్తి కాలేదు.

● తప్పని ఎదురుచూపులు

2021లో ప్రారంభించి రోడ్డు పనులు పూర్త వుతాయని స్థానికులు ఆశగా ఎదురు చూ స్తున్నారు. బోథ్ ప్రాంత ప్రజలకు వెళ్లాలంటే దూర భారం తగ్గడంతో పాటు సమయం సైతం ఆదా అవుతుంది. అరగంటలో బోథ్ నుంచి ధన్నూర్ మీదుగా అడెల్లి వెళ్లే ఆస్కారం ఉంది. అయితే ఘాట్ కటింగ్ ప్రాంతంలో రోడ్డు ఇబ్బందికరంగా ఉండడంతో వాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● ఎంపీ చొరవతో..

ఇటీవల ఎంపీ జి.నగేష్ అడెల్లి రోడ్డు పనులను పరిశీలించారు. అయితే వాహన దారులు పడుతున్న ఇబ్బందులను గమనించి అధికారులతో చెప్పి తాత్కాలికంగా మొరం వేయించారు. అయితే ఈ వేసవి కాలంలో ఇబ్బందులు ఘాట్ సెక్షన్‌లో తప్పవని వాపోతున్నారు. అధికారులు రోడ్డు పనులను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. బీటీ రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేయాలని కోరుతున్నారు. కనీసం ఈ వేసవి వరకైనా పూర్తి చేసినట్లయితే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోతాయి.

బరంపూర్ పాఠశాలలో
ఘనంగా సంక్రాంతి సంబరాలు

తలమడుగు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలలో శనివారం ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష మాట్లాడుతూ సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో పాఠశాలలో విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దానధర్మాల పండుగగా చెప్పుకునే పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పాఠశాల విద్యార్థులతో విచిత్ర వేషధారణ, ఎడ్లబండి హరిదాసులా, ముగ్గుల పోటీలు, పిండి వంటకాలు ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేందర్ యాదవ్, లక్ష్మీనారా యణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుండేగాం వాసుల గోడు పట్టదా..!?

- శాపంగా మారిన పల్సికర్ రంగారావు ప్రాజెక్టు
- వ్యవసాయ భూములు నీట మునగడంతో రైతుల ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు

భైంసా రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా భైంసా మండలంలో 2017 సంవత్సరంలో ప్రారంభించిన పల్సికర్ రంగారావు ప్రాజెక్టు గుండేగాం వాసులకు శాపంగా మారింది. ఈ ప్రాజెక్టు వల్ల బ్యాక్ వాటర్ పరిధిలో ఉన్న గుండేగాం గ్రామస్థులకు ప్రాణ సంకటంగా మారుతుంది. గత ప్రభుత్వ హయాంలో అధికారులు సర్వేలు నిర్వహించారు. కానీ ఇప్పటి వరకు మా గ్రామస్థులకు ఎటువంటి పారితోషికం లభించలేదు. ప్రతీ సంవత్సరం జూన్ మాసంలో భారీ వర్షం కురవడంతో ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గుండేగాం ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సమయంలో రాజకీయ నాయకులు, అధికారులు, ప్రతిపక్ష నాయకులు గ్రామానికి వచ్చి పరామర్శించడం ఆనవాయితీగా మారింది. అధికారులు ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం అయ్యాయి. అధికార యంత్రాంగం భైంసా సమీపంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో తాత్కాలికంగా 81 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. గ్రామంలో మొత్తం 162 కుటుంబాలు ఉండగా 364 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వ్యవసాయ భూములు నీట మునగడం వల్ల రైతులు అధికంగా నష్టపోవాల్సి ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం హామీలకే పరిమితం కాగా, ఈ ప్రభుత్వమైన మా గ్రామస్థులకు పునరావాసం కల్పిస్తుందని ప్రతిఒక్కరూ ఆశిస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను గుండేగాం గ్రామ వాసులు కోరుతున్నారు.



గుండేగాం గ్రామం ఇదే



గుండేగాం గ్రామస్థులకు పునరావాసం కల్పించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

ప్రభుత్వం పునరావాసం కల్పించాలి
- సూర్యవంశీ చంద్రకాంత్, గ్రామస్థుడు




పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో తమ గ్రామం పూర్తిగా ముంపుకు గురైందని, గత ప్రభుత్వ హయాంలో అధికారులు వచ్చి సర్వేలు చేశారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి సహాయం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం మా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.

పల్సికర్ ప్రాజెక్టు వల్ల ఇబ్బందులు
- ఎస్. కైలాష్, గ్రామస్థుడు



వర్షాకాలంలో భారీ వర్షం కురవడంతో మేము భయభ్రాంతులకు గురవుతున్నాం. విషపూరిత జీవులు తిరుగుతూ ఉంటాయి. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరుతున్నాం.



అంతా.. గందరగోళం!



- జిల్లాలో రేషన్‌కార్డుల జాబితాపై తీవ్ర విమర్శలు
- రేషన్‌కార్డు ఉన్న వారికే మళ్లీ జాబితాలో చోటు
- ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఆర్మీ జవాన్ల పేర్లు
- జాబితాలో కానరాని అర్హుల పేర్లు
- సర్వేలో బయటపడుతున్న అధికారుల తప్పిదాలు
- ఆందోళనలో దరఖాస్తుదారులు



నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామం రేషన్‌కార్డు జాబితాలో దర్శనమిచ్చిన ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు

ఆదిలాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల అమలుకు అర్హుల ఎంపికలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ జాబితా అంతా గజిబిజిగా గందరగోళంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలతోపాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి కొత్తగా మరో నాలుగు పథకాలను ప్రారంభించాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పథకాల అమలుపై అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డుల జారీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 60వేలకు పైగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు రాగా ప్రభుత్వం మాత్రం 18,741మంది లబ్ధిదారుల జాబితాను విడుదల చేసింది. ఈనెల 20 నుంచి 24వరకు గ్రామసభలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేను చేపడుతున్నారు. అసలు ఈ జాబితాను దేని ఆధారంగా రూపొందించారో అధికారులకే స్పష్టత లేకుండా పోయింది. ప్రజాపాలన, కులగణన సర్వే ఆధారంగా రేషన్‌కార్డుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కానీ అధికారులు దీనిపై కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితులకు దారితీస్తోంది. ప్రభుత్వం విడుదల చేసిన రేషన్‌కార్డుల జాబితాపై పలువురు అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాబితాలో పేర్లు లేకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

తప్పిదం ఎవరిదీ ?

అసలైన అర్హులకే సంక్షేమ పథకాలు అందాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. అయితే ప్రజాపాలన, కులగణన దరఖాస్తుల ఆధారంగానే ప్రభుత్వం అర్హులను గుర్తించి రేషన్ కార్డుల జాబితాను విడుదల చేసిందని అధికారులు చెబుతున్నారు. అయితే జాబితాలో మాత్రం అనర్హులకు అవకాశం దక్కడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు మూడుసార్లు వివిధ రకాల సర్వేలు చేపట్టినా ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించలేకపోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం తప్పిదాల కారణంగానే ప్రభుత్వం వద్దకు తప్పుడు సమాచారం చేరుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి తప్పుడు జాబితాలను విడుదల చేయడంపై అసలు తప్పిదం ఎవరిదన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజాపాలన దరఖాస్తులు, కులగణన సర్వేల్లో పూర్తి సమాచారాన్ని సేకరించిన తర్వాత కూడా ఇలాంటి తప్పిదాలు ఎలా జరుగుతున్నాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

జాబితాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు..

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రేషన్‌కార్డుల జాబితాలో పలువురు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా రేషన్‌కార్డుల జాబితాను విడుదల చేసిందా..? లేక అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం జాబితాను రూపొందించారా..? అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడితోపాటు రెవెన్యూ అధికారి, పలువురు ఆర్మీ జవాన్లకు రేషన్‌కార్డు జాబితాలో పేర్లు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అలాగే సిరికొండ మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ఇప్పటికే రేషన్‌కార్డులు ఉన్నా.. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రేషన్‌కార్డుల జాబితాలో మళ్లీ వారినే అర్హులుగా గుర్తిస్తూ జాబితాను విడుదల చేయడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేను చేపట్టి అనర్హులకు తొలగిస్తున్నామని అధికారులు చెబుతున్నా ఇంతకు ముందు చేపట్టిన కులగణన సర్వేలో ఎందుకు తప్పిదాలు జరిగాయో అధికారులకే తెలియాలి. అధికారుల నిర్లక్ష్యం మొక్కుబడిగా సర్వేలు చేపట్టడంతోనే ఇలాంటి పరిస్థితులకు దారితీస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని మండలాల్లోనైతే అధికారులకు ఆశ చూపడం, స్థానిక నేతల ఒత్తిళ్లతో ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతున్నట్లు సమాచారం.

అసలైన అర్హులకు నిరాశే...

ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న పేదలు నిరాశకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ రేషన్‌కార్డులకు నోచుకోని వారు ఈ ప్రభుత్వంపైనే భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ పరిస్థితులు గందరగోళంగా మారడంతో రేషన్‌కార్డుల ఆశలు వదులుకుంటు న్నారు. వేలల్లో దరఖాస్తులు ఉంటే వందల్లో రేషన్‌కార్డులను జారీ చేడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో గ్రామంలో వందకు పైగా రేషన్‌కార్డులు అవసరం ఉండగా 5 నుంచి 10 రేషన్‌కార్డులు మాత్రమే జారీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తుందని చెబుతున్నారు. అసలే స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడడంతో అధికార పార్టీ నేతల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది.

దరఖాస్తు చేసుకున్నా..
జాబితాలో పేరు లేదు..
: తోకల రాజమణి, గృహిణి, సిరికొండ

వివాహమై అయిదు సంవత్సరాలు గడిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు చేయలేకపోయింది. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా నూతనంగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారుల తప్పిదం వల్ల ఇటీవల విడుదల చేసిన జాబితాలో చోటు దక్క లేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మాకు ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్‌కార్డు అందించాలి.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి
● జిల్లా కలెక్టర్ రాజర్షిషా


సర్వేతీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మావల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసాల సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని బట్టి సావర్గంలో పర్యటించి సర్వేతీరును పరిశీలించారు. సర్వేలో సిబ్బందికి తలెత్తిన సందేహాలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకుధికారి రాజలింగు, ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి హేమలత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలదే భవిష్యత్తు
● పీవో కుష్బూగుప్తా


ట్రైకర్ చెక్కులు పంపిణీ చేస్తున్న పీవో కుష్బూ గుప్తా

ఉట్నూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయని, భవిష్యత్తులో రైతుల స్థితిగతులను తీర్చిదిద్దడంలో రైతుఉత్పత్తి సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూగుప్తా పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ట్రైకర్ మొదటి దశ చెక్కులను ప్రాజెక్టు అధికారి లబ్ధిదారులకు అందించారు. ట్రై కార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బన రైతు ఉత్పత్తి సంఘాలకు మొదటిదశ రాయితీగా ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50 లక్షలు చొప్పున మొత్తం రూ.15 లక్షలు విడుదల అయ్యాయన్నారు. వాటికి సంబంధించిన రాయితీ చెక్కులను రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యానఅధికారి గుడిమల్ల సందీప్ కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సం ఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞాశీల్, బోర్డు డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణం కోసం స్థల పరిశీలన

సిరికొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలో పబ్లిక్ హెల్త్ సెంటర్(పీహెచ్సీ) నిర్మాణం కోసం శనివారం పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ శివరాం స్థానిక నగేష్ నగర్ కాలనీలో గల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్ డీఈఈ శివరాం మాట్లాడుతూ...మండలంలోని నాయకులు, ఆయా గ్రామాల ప్రజల విన్నపం మేరకు త్వరలోనే సిరికొండలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. దీని కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో ఫణిందర్, పంచాయతీరాజ్ డీఈ రాజేశ్వర్, ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, నాయకులు ఒరగంటి పెంటన్న, తోకల చిన్న రాజన్న, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, సామాజిక కార్యకర్త గుగ్గిళ్ళ స్వామి, జింక లక్ష్మణ్, రవి, లస్మన్న, ఇమామ్, దత్తు, మల్లేష్, పత్రీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు
● జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తలమడుగు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం మండలంలోని ఖోడాద్ గ్రామంలో అధికారులు నెరవేస్తున్న సర్వే పనులను శ్యామలాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా రైతులకు రైతు భరోసా కింద అందిస్తున్న పెట్టుబడి సాయం పంటలు సాగు చేసే రైతులకు అందే విధంగా చూడాలన్నారు. రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు యోగం గాని భూములు ఇటిక బట్టిన భూములు వాటిని ప్రత్యేకించి గుర్తించాలన్నారు. అదే విధంగా లిస్టులో పేరు రాని లబ్ధిదారులు గ్రామాల అధికారులను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గ్రామసభలో పంపిణీ చేయాలని సూచించారు. లిస్టులో పేరు రాని లబ్ధిదారులు గ్రామ పంచాయితీ సెక్రటరీ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు మెనూ ప్రకారం పౌష్ఠికాహారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ సిబ్బంది సమయ పాలన పాటించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీ, పంచాయితీ సెక్రటరీ శివకుమార్, శేఖర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్బా తండాలో రూ.12 లక్షలతో నిర్మించనున్న నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన బోథ్‌ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు తండావాసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సైతం రూ.ఐదు లక్షలతో పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను గ్రామస్తులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా గ్రామపర్యటనలు, సమస్యల పరిష్కా కృషికి ప్రత్యేకంగా గ్రామ పర్యటనలు చేస్తూ ముందుకు సాగుతున్నామ న్నారు. ఇదే మండల వాసిగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అన్నగా భావించి సమస్యలు తెలుపాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకు లు రాథోడ్‌సజన్, శివారెడ్డి, దేవేందర్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, డాక్టర్ జహీర్, సుజిల్ కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి కృషి
● బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయా గ్రామస్తులు, మజీద్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు గ్రామాల్లో సీసీ రోడ్ల కోసం వినతి పత్రం అందజేశారు. స్పందించిన బోథ్ ఎమ్మెల్యే అని ల్‌జాదవ్ మాట్లాడుతున్న రానున్న వారం రోజుల్లోనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అంతకు ముందు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు భూమారెడ్డి, పద్మ తదితరులున్నారు.

ఎన్టీఆర్‌కు ఘననివాళులు


ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న టీటీడీపీ నాయకులు

ఉట్నూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని టీటీడీపీ నాయకులు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. గంగన్నపేట చౌరస్తా వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీటీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పవర్ దేవిదాస్ మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో మరికంటి నారాయణ, సీపతి లింగగౌడ్, సాడిగె రాజేశ్వర్, నేతావత్ రాందాస్, జాదవ్ రవి నాయక్, రాజారామ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండలంలోని అడేగామ(కే) గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను శనివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పోతారెడ్డి, నాయకులు అలీ, గంగయ్య, దివాకర్‌రెడ్డి, లచ్చన్న తది తరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు వినియోగించుకోవాలి
● స్టేట్‌బ్యాంకు రీజినల్ మేనేజర్ గంగోని శ్రీనివాస్


వడ్డాడి ఆలయంలో జ్ఞాపికను అందిస్తున్న గ్రామస్తులు

తాంసి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న రుణా లను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ గంగోనిశ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వడ్డాడి గ్రామంలో ఉన్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్టేట్ బ్యాం క్ అధ్వర్యంలో రుణాలు తీసుకున్న రైతుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లిస్తే రెట్టిం పు రుణాలు ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకోవాలని కోరారు. ప్రతిరైతు బ్యాంకు వద్దకు వెళ్లి తగిన సమాచారా న్ని పొందాలని సూచించారు. తమ బ్యాంకుల్లో గోల్డ్‌రుణాలు, మోటార్ సైకిళ్ళు, ఇతర రుణాలను కూడా ఇస్తున్నామని వీటిని కూడా సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ కమిటీసభ్యులు ఆయనకు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలకొండ శ్రీకాంత్, మేనేజరు సత్యనారాయణ, గంగయ్య, శేఖరన్న, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడాలి
● బోథ్‌రేంజ్ అధికారి ప్రణయ్


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న రేంజ్ అధికారి సిబ్బంది

బోథ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వాటిని చంపినట్లయితే శిక్షతోపాటు జరిమానాలు విధించే ఆస్కారం ఉందని బోథ్‌రేంజ్ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. శనివారం రేంజ్ కార్యాలయంలో వన్యప్రాణులకు సంబంధించిన వాల్‌పోస్ట ర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ జంతువులను ఉచ్చులో పెట్టి విద్యుత్తు కంచెలను ఏర్పాటు చేసి వేటాడి చంపినట్లైతే మూడుసంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలుశిక్ష విధించే ఆస్కారం ఉందన్నారు. అంతేగాక 25 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని ఎఫ్ఆర్వో పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అమర్‌సింగ్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి నాగోరావు, జూనియర్ అసిస్టెంట్ సోలంకి పరశురాం, ఫారెస్ట్ బీట్‌ఆఫీసర్లు సం ధ్యారాణి, నాగోరావ్, ధన్‌రాజ్, అనిల్, రాదేశంలు పాల్గొన్నారు.

టీజీటీటీఎఫ్
రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రకాంత్

ఉట్నూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీజీటీటీఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉట్నూర్‌కు చెందిన జాదవ్ చంద్రకాంత్‌నాయక్ ఎన్నికయ్యారు. గిరిజన ఉపాధ్యాయుల సంఘాల కలయికగా టీజీటీటీఎఫ్ నూతన రాష్ట్ర శాఖ భద్రాద్రి జిల్లాలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మాలోత్ రామారావు, రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రకాంత్‌నాయక్ జాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వివరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకాంత్ నాయక్ జాదవ్ మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయుల సమస్యపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన రాథోడ్ గణేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు చేస్తామన్నారు. వీరి వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాదవ్ కపిల్ నాయక్ ఉన్నారు.